ప్రజాశక్తి

మంగళవారం 17 డిసెంబర్ 2024 | 5 | అనంతపురం





ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ వినోద్‌కుమార్



పాతవే..కొత్తగా..!

- మూడు క్లస్టర్ల ప్రకటన
- ప్రకటనలకే పరిశ్రమలు పరిమితం
- దశాబ్దకాలంలో ఏర్పాటైనది కియా ఒక్కటే..!



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటు కోసమని క్లస్టర ఏర్పాటుకు కసరత్తు చేసింది. ఇందులో పాత వాటినే కొత్తగా ఏర్పాటు చేస్తున్నట్టు చెబుతోంది. ఇందులో చిలమత్తూరు, లేపాక్షి మధ్యలో ప్రకటించింది. 8844 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపింది. ఇందుకు సంబంధించి ఇదివరకే లేపాక్షి నాలెడ్జి హబ్ పేరుతో 2008లోనే భూములను సేకరించారు. దాన్ని ఒక సంస్థకు కట్టబెట్టారు. ఆ సంస్థ పరిశ్రమ ఏర్పాటు చేయకుండా బ్యాంకు రుణం పొందింది. అవినీతి ఆరోపణల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంటు సంస్థ ఈ స్థలాలను జప్తు కూడా చేసింది. ఈ నేపథ్యంలో ఈ భూమిలో కొత్త క్లస్టర్ ఏర్పాటు ద్వారా న్యాయపరమైన సమస్యలను ఏ రకంగా అధిగమించడం సాధ్యమన్నది చూడాల్సి ఉంది. ఇక మరో క్లస్టర్ మడకశిర వద్ద అని ప్రకటించింది. ఇది కూడా ఇది వరకే పరిశ్రమల కోసం సేకరించి వెయ్యి ఎకరాల భూమి ఉంది. 2012లోనే పరిశ్రమల కోసమని సేకరించారు. ఇంకా కొద్ది మందికి పరిహారం అందలేదు. దీనిపై రైతులు అప్పుడప్పుడు పోరాటాలు సాగిస్తూనే ఉన్నారు. ఇప్పుడు ఈ భూముల్లో కొత్త పారిశ్రామిక క్లస్టర్‌గా ప్రకటించారు. ఇక్కడ ఎటువంటి పరిశ్రమలు వస్తాయన్నది చూడాల్సి ఉంది. ఇక అనంతపురం జిల్లాలో తిమ్మసముద్రం వద్ద పారిశ్రామిక క్లస్టర్ అని ప్రచారం నడుస్తోంది. ఇక్కడ కూడా పది సంవత్సరాల క్రితమే భూసేకరణ జరిగింది. ఇంత వరకు రాలేదు. ఇలా జిల్లాలో పెద్దఎత్తున భూసేకరణ ఇది వరకే జరిగి ఉన్నాయి. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో ఏయే పరిశ్రమలు వస్తాయన్నది చూడాల్సి ఉంది.

ప్రకటనలతోనే ముగిసిన పరిశ్రమలు

జిల్లాలో పరిశ్రమలు పెద్దఎత్తున ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రభుత్వాల ప్రకటనలు వెలువడుతూనే ఉన్నాయి. ఇందులో కొన్ని కార్యరూపం దాల్చకుండానే వెనుదిరిగిపోయాయి. ఇందులో డీ.హీరేహాల్ మండలం నేమకల్లు వద్ద కుదురేముఖ్ ఉక్కు పరిశ్రమ. కుదురేముఖ్, ఎపిఎండిసి, రాష్ట్రీ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ మూడు సంయుక్తంగా ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని 2012లో ఒప్పందం కూడా చేసుకున్నాయి. ఇప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. దీనికి ప్రధాన కారణం ఓబుళాపురం వద్దన్ను ఇనుప గనులను ఆ సంస్థలకు కేటాయించక పోవడంతోనే ముందుకు సాగలేదన్న విమర్శ ఉంది. జాకీ పరిశ్రమ 2018లో రాప్తాడు వద్ద ప్రకటించారు నిర్మాణపు పనులు కూడా ఏర్పాటు చేశారు. మధ్యలో ఆ పరిశ్రమ ఏర్పాటు జరగకుండానే వెనుదిరిగింది. దీనికి రాజకీయపరమైన కారణాలున్నయన్న ఆరోపణలున్నాయి. ఇవి కాకుండా కనగానపల్లి మండలం దాదులూరు వద్ద ఉక్కుపరిశ్రమ ఏర్పాటు చేయడానికి ఒక ప్రయివేటు సంస్థ ముందుకొచ్చినట్టు సమాచారం. ఆ పరిశ్రమ కూడా రాకుండానే మరో ప్రాంతానికి వెళ్లినట్టు సమాచారం. ఇలా అనేక పరిశ్రమలు కార్యరూపం దాల్చకుండానే వెనుదిరిగిపోతున్నాయి. గడిచిన దశబ్దకాలంలో జిల్లాలో ఏర్పాటైన పెద్ద పరిశ్రమ ఏదైనా ఉందంటే అది కియా ఒక్కటే కావడం గమనార్హం.



స్వర్ణ అనంతపురం దిశగా కృషిచేద్దాం

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వం సూచన మేరకు స్వర్ణ అనంతపురం దిశగా అధికారులందరూ కృషి చేసి సత్ఫలితాలు సాధించాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ సూచించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డిఆర్ఒ మాలోల, డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, తిప్పే నాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి 355 అర్జీలను స్వీకరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వ పథకాల అమలులో అనంతపురం జిల్లా మొదటి 3 నుంచి 6 స్థానాల్లో ఉందన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా జిల్లా అభివృద్ధి ప్రణాళికలను తయారు చేయాలని సిపిఓని ఆదేశించారు. హార్టికల్చర్‌లో వచ్చిన పంటను నిలువ చేయుటకు మార్కెటింగ్, కో-ఆపరేటివ్ అధికారులు సమన్వయం చేసుకుని ప్రణాళికలను తయారు చేసుకుని ఫలితాలను సాధించాలన్నారు. సోలార్ పార్క్, హైడ్రోజన్ పార్క్, కంప్రెస్ బయోగ్యాస్ ప్లాంట్, ఇంటిగ్రేటెడ్ ఎనర్జీ ఏర్పాటుకు ప్రభుత్వ భూములను అగ్రిమెంట్ల ద్వారా కంపెనీలకు ఇచ్చే విధంగా ప్రణాళికలను తయారు చేసుకోవాలని రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించారు. జాయింట్ కలెక్టర్, డిస్టిక్ సివిల్ సప్లై అధికారులు, తహశీల్దార్‌లు క్షేత్రస్థాయిలో పర్యటించి తనిఖీలు చేసిన జాబితాల నివేదికలను, ఎఫ్‌పి షాపులను డిసెంబర్ 31 నాటికి పూర్తిస్థాయిలో నిర్వహించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య శాఖ, వ్యవసాయ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు నిత్యం క్షేత్రస్థాయిలో అధికారులను పరివేక్షించాలన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో చేపట్టిన పనులన్నీ సకాలంలో పూర్తి కావాలని ఆదేశించారు. అన్న క్యాంటీన్‌లో సమయపాలన పాటిస్తూ, నాణ్యమైన భోజనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఓ అశోక్ కుమార్, జెడ్పీ సీఈవో వెంకటసుబ్బయ్యతో పాటు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



వైద్యులు, అధికారులతో సమావేశమైన విప్ కాలవ

సంక్రాంతిలోగా వైద్య పోస్టుల భర్తీ : విప్

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టుల భర్తీకి సంక్రాంతి లోపు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. కాలవ సోమవారం పట్టణంలోని తన నివాసంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆసుపత్రి స్థితిగతులపై సూపరింటెండెంట్ మెర్సీ జ్ఞానసుధ, పరిపాలన అధికారి మహబూబ్‌బాషాతో చర్చించారు. అనంతరం ఆసుపత్రిలో ఖాళీ వైద్యుల పోస్టుల అంశంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారితో ఫోన్లో చర్చించారు. సంక్రాంతిలోగా వైద్యుల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. త్వరలో ఆసుపత్రి అభివృద్ధి సలహా కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రాంతీయ ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని విప్ కాలవ తెలిపారు.

ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి-రాయదుర్గం

ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకూ పట్టణంలో రెండు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ ప్రతాప్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్ల లోపు వారికి, ఐదేళ్లు పైబడి వారికి కొత్తగా ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేషన్, మొబైల్ నెంబర్ లింక్, చేర్పులు, మార్పులు, 60 ఏళ్లు పైబడిన వారికి బయోమెట్రిక్ అప్‌డేషన్ చేస్తారన్నారు. 2011-16 మధ్య కాలంలో ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా ఆధార్ నమోదు చేసుకున్న వారు కచ్చితంగా తగిన ధ్రువీకరణ పత్రాలు అందించి ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలన్నారు. కోట వీధి 13వ వార్డు సచివాలయం, బళ్లారి రోడ్డులోని 16వ వార్డు సచివాలయంలో ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకూ సేవలందిస్తారన్నారు.

జ్వరంతో చిన్నారి మృతి

45 రోజులుగా చికిత్సపొందుతూ మృత్యువాత



లిఖిత (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

కళ్యాణదుర్గం పట్టణానికి చిన్నారి ఓ చిన్నారి డెంగ్యూ లక్షణాల జ్వరంతో మరణించింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు కళ్యాణదుర్గంకు చెందిన లిఖిత(8) గత 45 రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ప్రారంభంలో స్థానికంగా చికిత్సలు చేయించినా తగ్గలేదు. దీంతో మెరుగైన వైద్య కోసం బెంగుళూరుకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి సోమవారం నాడు చిన్నారి మృతి చెందింది. చిన్నారి చికిత్స కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే సురేంద్రబాబు రూ.10 లక్షల సాయం అందించారు. పలువురు దాతలు సాయం అందించారు. అయినా చిన్నారి ప్రాణాలు దక్కకపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

అదాని కోసం ప్రజలపై భారాలా..?

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ - 'నమో అదాని కరెంటు కహానీ' పుస్తకావిష్కరణ



'నమో అదానీ కరెంటు కహానీ' పస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ అదానీకి దాసోహమైన ప్రభుత్వ పాలకులు ప్రజలపై విద్యుత్ భారాలు మోపుతున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ విమర్శించారు. విద్యుత్ కుంభకోణం అమెరికాలో బయటపెట్టిన నేపథ్యంలో సిపిఎం ఆధ్వర్యంలో రూపొందించిన 'నమో అదానీ కరెంట్ కహానీ' పుస్తకాన్ని ఎన్జీవో హోంలో సోమవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కేంద్ర ప్రభుత్వ సంస్థ 'సెకి' సౌరవిద్యుత్ ఒప్పందం కుదుర్చుకోవడానికి అదానీ కంపెనీలు రూ.1,750 కోట్లు లంచం ఇచ్చాయన్న కుంభకోణం అమెరికాలో బయట పడిందన్నారు. ఇంత పెద్ద కుంభకోణం బయటపడినా మన నాయకులు మాత్రం మౌనం వహించడం శోచనీయం అన్నారు. ఎటువంటి దర్యాప్తులు చేపట్టక పోగా, దాన్ని కప్పెయ్యడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని విమ ర్శించారు. రాష్ట్రాలు,దేశాలను దాటి భారీస్థాయిలో జరిగిన ఈ వ్యవహారం కేవలం అవినీతికి సంబంధించినది మాత్రమే కాదన్నారు. దీని ఫలితంగా ప్రజలు అనేక భారాలను మోయాల్సి వస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రజల మీద పడుతున్న విద్యుత్ బిల్లుల భారం వంటివి అదానీ అవినీతి ప్రతిఫలమే అన్నారు. వేల కోట్ల లంచాలు తీసుకుని చేసుకున్నారన్న 'సెకి' ఒప్పందాన్ని తక్షణం రద్దు చేయాల్సిన మన రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం పేరుతో ఆదానీ సేవకు తపిస్తోందని విమర్శించారు. వైఎస్‌ఆర్‌సిపి ప్రభుత్వం, నేటి టిడిపి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల పట్ల కనీస బాధ్యతతో ఆలోచించకుండా కార్పొరేట్ల సేవకు తహతహ లాడుతుండడం సిగ్గుచేటన్నారు. సరళీకరణ విధానాలు, క్రోనీ క్యాపిటలిజం ఎంతటి ఆర్థిక అరాచకాలు, అవినీతికైనా పాల్పడతాయనేందుకు ఈ కుంభకోణం అతి పెద్ద నిదర్శనం అన్నారు. ప్రజలకు తీవ్రనష్టం కలగజేసే ఈ అవినీతి ఒప్పందం వాస్తవాలను పుస్తకం ద్వారా ప్రజాశక్తి బుక్ హౌజ్ వెలుగులోకి తెస్తోందన్నారు. ఈ పరిణామాలన్నీ నిశితంగా గమనించి ప్రజలంతా చైతన్యంతో ప్రతిఘటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎం.బాలరంగయ్య, ఎస్.నాగేంద్ర కుమార్, వి.సావిత్రి, జిల్లా కమిటీ సభ్యులు వి.రామిరెడ్డి, ఆర్.చంద్రశేఖర రెడ్డి, ఎం.కష్ణమూర్తి, భాస్కర్, ఎం.నాగమణి, టి.రామాంజినేయులు, వై.వెంకట నారాయణ, ప్రకాష్ రెడ్డి, టి.గోపాల్, ముత్తుజా, వలి, ఇర్ఫాన్, మసూద్, ఓబులేసు, జీవ, రాజా, లక్ష్మి నారాయణ, వెంకటేష్, ఓతురు పరమేష్, శ్రీనివాసులు, సురేష్, విశాలాంధ్ర బుక్ హౌస్ మాజీ మేనేజర్ ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ఎర్రకోట గణతంత్ర దినోత్సవ వేడుకలకు

జెఎన్‌టియు విద్యార్థులు



విద్యార్థినిని అభినందిస్తున్న విసి సుదర్శనరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మమత

ప్రజాశక్తి -అనంతపురం

ఢిల్లీ ఎర్రకోటలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, ఈసీఈ 3వ సంవత్సరం విద్యార్థి వెంకటేశ్ నాయక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి విసి హెచ్.సుదర్శనరావు, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా॥జి.మమత మాట్లాడుతూ తమ విద్యార్థి గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఎంపిక అవడం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలకే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక గౌరవం తీసుకొచ్చిందన్నారు. జెఎన్‌టియుఎ విద్యార్థులు వరుసగా రెండవసారి గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు ఎంపిక అవడం సంతోషంగా ఉందన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ సాధించిన ఈ గుర్తింపు, సమాజ నిర్మాణంలో యువతకు ఉన్న సామర్థ్యానికి చిహ్నంగా నిలుస్తుందని రిజిస్ట్రార్ కె.కృష్ణయ్య పేర్కొన్నారు. విద్యార్థినిని ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, డా॥ఎస్.శారదా, ఎన్ఎస్ఎస్ యూనిట్ కోఆర్డినేటర్‌లు అభినందించారు.

విద్యార్థి అదృశ్యంపై ఆర్డీవో, తహశీల్దార్ విచారణ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని మారెంపల్లి కాలనీలో ఉన్న ఎపిఆర్ఎస్ ఎస్టీ వసతి గృహాన్ని సోమవారం ఆర్డీవో వసంతబాబు, తహశీల్దార్ భాస్కర్ సందర్శించి తప్పిపోయిన విద్యార్థి ఘటనపై విచారణ చేపట్టారు. హాస్టల్‌లో 8వ తరగతి చదువుతున్న విజయ్‌సాయి ఉదయం 11 గంటల సమయంలో పాఠశాల నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ విషయం తెలిసి వారు పాఠశాలకు వెళ్లి ఆరా తీశారు. ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యులు మోహన్, పట్టణ సిఐ యువరాజ్‌కు ఈ విషయం తెలుపగా కేసు నమోదు చేసి బాలుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు

భూ సమస్యలపై రైతుల వినతి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం రైతులు తహశీల్దార్ మునివేలుకు విజ్ఞప్తి చేశారు. రైతులు మాట్లాడుతూ సరిహద్దులు, జాయింట్ ఎల్‌పి, వన్-బి, అడంగల్, తదితర భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

చురుగ్గా టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-రాయదుర్గం



సభ్యత్వ నమోదు చేస్తున్న టిడిపి నాయకులు

పట్టణంలో టిడిపి సభ్యత్వ నమోదు చురుగ్గా కొనసాగుతోంది. పట్టణంలోని ఐదో ఎన్నికల వార్డులో సోమవారం ఆ వార్డు ఇన్‌ఛార్జి, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కె.మహబూబ్ బాషా ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు ప్రయోజనాలను వివరించి సభ్యత్వ నమోదు చేయించారు. సభ్యులుగా చేరిన వారికి గుర్తింపు కార్డులు జారీ చేశారు. మహబూబ్‌బాషా మాట్లాడుతూ తమ వార్డులో అత్యధిక సభ్యత్వాలు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పూజారి శివప్రసాద్, జిలాన్‌బాషా, కృష్ణ, సత్తి, తదితరులు పాల్గొన్నారు.



డీఎస్సీ మెటీరియల్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో డీఎస్సీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని టిడిపి ప్రజావేదికలో సోమవారం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు డీఎస్సీకి సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే సహకారంతో పట్టణంలో ఏర్పాటు చేసిన ఉచిత కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులు టెట్‌లో మంచి మార్కులు సాధించారు. వారికి ఎమ్మెల్యే డీఎస్సీ మెటీరియల్ అందజేశారు. అభ్యర్థులు మాట్లాడుతూ శిక్షణతో పాటు మెటీరియల్ అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అదే స్ఫూర్తితో కష్టపడి చదివి ఉపాధ్యా య ఉద్యోగం సాధిస్తామన్నారు.

హిమోఫిలియా బాధితుల వినతి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఫ్యాక్టర్ ఇంజక్షన్లు నిరంతరం అందుబాటులో ఉంచాలని కోరుతూ సోమవారం హిమోఫిలియా బాధితులు తహశీల్దార్ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. హిమోఫిలి యా రోగులకు చిన్న గాయమైనా రక్తస్రావం ఆగదు. కొన్ని సందర్భాల్లో తీవ్ర రక్తస్రావమై ప్రాణాపాయ స్థితి ఏర్పడుతుంది. అలాంటి సమయంలో ఫ్యాక్టర్ ఇంజక్షన్ వేయించుకుంటేనే రక్తస్రావం ఆగుతుంది(అంటే రక్తం గడ్డకట్టుతుంది). మండలంలో ఇలాంటి బాధితులు 11 మంది ఉన్నారు. 4 నెలలుగా ఫ్యాక్టర్ ఇంజక్షన్లు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో లేకపోవడంతో హిమోఫిలియా బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తహశీల్దార్ తెలిపారు. వినతి ఇచ్చిన వారిలో హిమోఫిలిక్ సొసైటీ సభ్యులు అనిల్‌బాబు, తిమ్మారెడ్డి, బసవ, నాగరాజు, నందేష్ , తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ కమిషనర్ ఎవరు.?

- ఇంకా ఛార్జ్ ఇవ్వని కమిషనర్ నాగరాజు
- ఉద్యోగుల్లో గందరగోళం
- వాడీవేడిగా నేడు కౌన్సిల్ మీట్ జరిగే అవకాశం



ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పూర్తి బాధ్యతలను రామలింగేశ్వరకు అప్పగిస్తూ మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ హరి నారాయణ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం నుంచి రెండు నెలల పాటు కమిషనర్ నాగరాజు దీర్ఘకాలిక సెలవుపై వెళ్తున్నట్లు తెలియజేశారు. సోమవారం సాయంకాలం 6:30 గంటలు కావొస్తున్నా కొత్త అధికారికి ఛార్జి అప్పగిస్తూ సంతకాలు చేయడంలో జాప్యం జరిగింది. ఈ ప్రక్రియ జరక్కపోవడంతో కార్పొరేషన్ కమిషనర్ బాధ్యతల స్థానంలో ఎవరున్నారన్న దానిపై సందేహం నెలకొంది. మంగళవారం కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం జరగనున్న నేపథ్యంలో పరిపాలనాధికారి లేకపోవడంతో పాలనాపరమైన సమస్యలు తలెత్తే అవకాశాలు కన్పిస్తున్నాయి. జిల్లా కేంద్రంలో కలెక్టర్ పర్యవేక్షణలో ఉన్న కార్పొరేషన్‌లో కమిషనర్ ఎవరన్న దానిపై స్పష్టత లేకపోవడం ఉద్యోగవర్గాలను విస్మయానికి గురి చేస్తోంది. కమిషనర్ నాగరాజు వచ్చి మూడు నెలలు కావస్తున్నా ఇంజినీరింగ్ విభాగంలో బదిలీపై వచ్చిన అధికారులకు పనుల కేటాయింపు ఫైలుపై సంతకాలు చేయలేదు. నీటి సరఫరా పర్యవేక్షణ ఎవరన్న అంశంపై సందిగ్ధం నెలకొంది. పట్టణ ప్రణాళిక విభాగం సైతం ఇష్టారాజ్యంగా సాగిపోతున్నా కట్టడి చేసే నాథుడే లేడని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రధాన రహదారుల్లో భవన నిర్మాణాలు చేపట్టే సమయంలో రోడ్డు విస్తరణకు గిఫ్ట్‌డిడ్ కింద కార్పొరేషన్‌కు ఇచ్చే అంశం కూడా నిబంధనల ప్రకారం కాకుండా మామూళ్లు తీసుకుని అనుమతులు మంజూరు చేస్తున్నట్లు తెలుస్తోంది. రెవెన్యూ విభాగంలో ఒక్కో పోస్టుకు పది లక్షల రూపాయలు చెల్లించి ఆ విభాగంలోకి వచ్చారనే ప్రచారం ఉద్యోగ వర్గాల్లో నడుస్తోంది. రెండు సంవత్సరాల క్రితం కౌన్సిల్లో కార్పొరేటర్లు కొందరు రెవెన్యూ సిబ్బంది అవినీతి అక్రమాలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేశారు. అలాంటి వారినే మళ్లీ ఇప్పుడు రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లుగా బాధ్యతలు అప్పగించడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికే రెవెన్యూ విభాగంలో పోస్టుల భర్తీ ప్రక్రియలో సుమారు అరకోటికి పైగా ముడుపులు చేతులు మారిన వైనంపై స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ కార్యాలయానికి ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ నెల 14న జరిగిన లోక్ అదాలత్ కార్యక్రమంలో పన్ను మొండి బకాయి దారులకు నోటీసులు పంపిణీలో కూడా రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనిపించింది. ఉన్నతాధికారులకు ముడుపులు ఇచ్చాం.. పనిచేస్తేనేమిటి చేయకపోతే ఏమిటనే అన్న భావంలో కొందరు సిబ్బంది ఉన్నారనే ప్రచారం ఉంది. పన్నులను సక్రమంగా వసూలు చేసి కార్పొరేషన్ రాబడికి కృషి చేయాల్సిన రెవెన్యూ విభాగ సిబ్బంది వాటిని పక్కన పెట్టి స్వప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నా వారిని పర్యవేక్షించే ఇద్దరు ఉన్నతాధికారులు సైతం చూసీచూడనట్టు వ్యవహరించటం సరికాదనే భావన ఉంది. ఇంజినీరింగ్ విభాగంలో అభివృద్ధి పనుల అంశంపై కార్పొరేటర్ల తీవ్రస్థాయిలో అధికార యంత్రాంగంపై విరుచుకుపడే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఉద్యోగ వర్గాలు చర్చించుకుంటున్నాయి. కోట్ల రూపాయల టెండర్లు నిర్వహించినప్పటికీ ఏ ఒక్క పని కూడా గడిచినా కొన్ని నెలలుగా జరగకపోవడం ఇబ్బందికరంగా మారినట్టు కార్పొరేటర్లు చర్చించుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కార్పొరేషన్ పాలనను సజావుగా నడిపిస్తారని భావించిన కమిషనర్ నాగరాజు రాజకీయ ఒత్తిళ్లతో ఏకంగా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడం అనేక ప్రశ్నలకు తావిస్తోంది. ముఖ్య నేతల నడుమ సాగుతున్న అంతర్యుద్ధాన్ని తాళలేక ఆయన సెలవుపై వెళ్లారనే చర్చ నడుస్తోంది. గత కొంతకాలంగా మున్సిపల్ కార్పొరేషన్ పరిపాలన అస్తవ్యస్తంగా మారి అభివృద్ధి కుంటుబడటం, పాలనయంత్రాంగం గాడి తప్పడం కన్పిస్తూనే ఉంది. ఇలాంటి సమయంలో మంగళవారం జరిగే కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగే పరిస్థితులు కన్పిస్తున్నాయి.

ప్రాణాలు పోతేగాని స్పందించరా.?

నడి రోడ్డుపై మట్టి కుప్పలు
ఆందోళనలో వాహనదారులు


రోడ్డుపై వేసిన మట్టి కుప్ప

ప్రజాశక్తి-యల్లనూరు

'రోడ్డుపై గొయి తవ్వి వదిలారు.. ప్రాణాలో పోయే వరకూ గొయ్యి పూడ్చరా..' అంటూ వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో సమీపంలోని పాతపేట శివారులో 15రోజుల క్రితం విద్యుత్ స్తంభం వద్ద ఓ కంపెనీకి సంబంధించిన నెట్ కేబుల్ తెగిపోయింది. దీంతో జెసిబి సాయంతో రోడ్డు పక్కన గాడి తీసి మట్టిని నడిరోడ్డుపై కుప్పగా పోశారు. ఫలితంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా రాత్రి సమయంలో రోడ్డు కనపడక ఎప్పుడు ఏం ప్రమాదం సంభవిస్తుందో అని ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు మండల పరిధిలోని పాతపల్లి గ్రామ సమీపంలో కూడా పెద్ద గొయ్యి ఉంది. ఈ ప్రాంతంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతులను పూడ్చడంతోపాటు మట్టి కుప్పలను తొలగించాలని మండల వాసులు కోరుతున్నారు.

అనర్హులకు కౌలు రసీదులు ఇచ్చిన వారిపై చర్యకు డిమాండ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సాగు చేస్తున్న కౌలు రైతులకు కాకుండా సాగు చేయని వారికి కౌలు రసీదులు ఇచ్చిన దేవాదాయ శాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని ఎపి కౌలు రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాలరంగయ్య కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరవకొండ మండలం రేణుమాకులపల్లిలో సర్వేనెంబర్ 103-ఏలో 9.60 ఎకరాల సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయ భూమిలో వరి, కంది పంటలు వేసుకుని ఉన్న కౌలు రైతులకు కాకుండా సాగులో లేని వారికి దేవాదాయ శాఖ అధికారులు కౌలు రసీదులు ఇచ్చారన్నారు. ఎనిమిదేళ్ల నుంచి ఎస్‌సి, బిసి రైతులు కౌలు చెల్లిస్తూ సాగులో ఉండి పంటలు పండించుకుని అప్పుల పాలవుతున్నారన్నారు. అలాంటి వాస్తవ పంట సాగుదారులను కాకుండా అనర్హులకు కార్డులు జారీ చేయడం బాధాకరమన్నారు. కావున జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వాస్తవ సాగుదారులతో కౌలు కట్టించుకుని వారి పేరున ఈ క్రాప్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు, సురేష్, నారాయణ స్వామి, రామాంజనేయులు, రాముడు పాల్గొన్నారు.

అభివృద్ధిని ఓర్వలేకే వైసిపి దుష్ప్రచారం : టిడిపి

ప్రజాశక్తి-ఆత్మకూరు


విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసిపి నాయకులు దుష్ప్రచారం ప్రారంభించారని టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో పంచాయతీలకు బిల్లులు చెల్లించకుండా గ్రామాలను విస్మరిస్తే టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పంచాయతీలకు ప్రత్యేకంగా బిల్లులు చెల్లించి అభివృద్ధికి బాటలు వేశారన్నారు. తాము అధికారంలోకి వచ్చాక నియోజకవర్గవ్యాప్తంగా దాదాపు రూ.50కోట్లతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఒక్క ఆత్మకూరు పంచాయతీకే రూ.16లక్షలు చేసినట్లు వివరించారు. అభివృద్ధి చూడలేక వైసిపి నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వైసిపి హయాంలో టిడిపి నాయకులు చేసిన బిల్లులకు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఇంటి చుట్టూ గుత్తేదారులు తిరిగితే కమీషన్లు తీసుకుని బిల్లులు మంజూరు చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు చౌకబారు విమర్శలు మానుకుని అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి శశాంక్‌చౌదరి, నాయకులు వెంకటేష్‌నాయక్, వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంపి-1 పరీక్ష పేపర్‌ను పాఠశాలలకు నేరుగా పంపాలి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

డిసెంబర్ 17, 18, 19, 20వ తేదీల్లో ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న ఎస్ఎంపి-1 పరీక్ష పేపర్లను నేరుగా పాఠశాలలకే ఇవ్వాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగయ్య, గౌరవాధ్యక్షులు రమణయ్య సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఎస్ఎంపి -1 పరీక్ష పేపర్లను ఉదయం, సాయంత్రం ప్రధానోపాధ్యాయులు పోలీస్ స్టేషన్‌కి గంట ముందు వెళ్లి పేపర్లు తెచ్చుకుని పరీక్ష నిర్వహించాల్సి ఉందన్నారు. ఇది సరైంది కాదన్నారు. పరీక్ష పేపర్లు లీకవుతున్నాయని ఉన్నతాధికారుల దష్టికి ముందుగానే తీసుకువెళ్లినా తగిన చర్యలు తీసుకోలేదన్నారు. పేపర్ల లీకేజీకి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీస్‌స్టేషన్‌కు 15 నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, అంతదూరం నుంచి పేపర్లు పట్టుకెళ్లినప్పుడు కూడా ప్రశ్నపత్రాలు భద్రతకు ఇబ్బంది కలుగుతుందన్నారు. కావున విద్యాశాఖ అధికారులే నేరుగా పాఠశాలకు పరీక్ష పేపర్లు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేదా 10వ తరగతి పబ్లిక్ పరీక్షల మాదిరి హెడ్ మాస్టర్లు పరీక్ష పేపర్లు తీసుకు వెళ్లడానికి పోలీస్ బందోబస్తు కల్పించాలని కోరారు.

19న ఉచిత మెగా వైద్యశిబిరం

అనంతపురం రూరల్ : అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ జన్మదినం సందర్భంగా అంబికా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు సోమవారం ఎంపి కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. ఈ సందర్భంగా కిమ్స్ సవేరా, శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, భార్గవి, అర్జున్ ఆసుపత్రి, గురుకృప చిల్డ్రన్స్ ఆసుపత్రి సౌజన్యంతో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారి లింగమయ్య

అగ్నిమాపక వారోత్సవాలు

అనంతపురం : నగరంలోని డాక్టర్ కంటి ఆసుపత్రిలో సోమవారం అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా అగ్నిమాపక ఆఫీసర్ కెపి లింగమయ్య అగ్నిమాపక ప్రమాద నివారణ పద్ధతులు, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా నిర్మూలించాలనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అక్బర్ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ అక్బర్, ఫైర్ ఆఫీసర్ కృష్ణకుమార్, ఫైర్‌మెన్‌లు తిప్పేస్వామి, డి.సుధాకర్, హోంగార్డు నరేష్, డాక్టర్ మిధునారెడ్డి, డాక్టర్ రాణిఐశ్వర్య, డాక్టర్ తంకిన్ షాజియా పాల్గొన్నారు.

మందుల దుకాణాలపై దాడులు

అనంతపురం : విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వైబిపిటిఎ ప్రసాద్ ఆదేశాల మేరకు సోమవారం నగరంలోని తాహా ఆయుర్వేద ఆసుపత్రి, అభయ ఆయుర్వేద కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా లైసెన్స్ లేకుండా విక్రయిస్తున్న 13 రకాల మందులను అమ్ముతున్నట్లు గమనించి నోటీసులు జారీ చేశారు. ఈ తనిఖీల్లో డీఎస్పీ నాగభూషణం సిఐ జమాల్‌బాషా, అగ్రికల్చర్ ఎఒ వాసుప్రకాష్, డిసిటిఒ సురేష్‌కుమార్, డ్రగ్ ఇన్స్‌పెక్టర్ హనుమప్ప, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలని వినతి

ప్రజాశక్తి-యల్లనూరు


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆదినారాయణ

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ కింద కూలీలందరికీ పనులు కల్పించాలని జనసేన మండల కన్వీనర్ ఆదినారాయణ కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదికలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పనులు అడిగిన కూలీలందరికీ పనులు కల్పించాలని కోరారు. అలాగే మండల కేంద్రంలోని వెంకయ్య కాలువ రోడ్డు సమీపంలో సర్వే నెంబర్ 271లో 6.72 సెంట్ల ప్రభుత్వ భూమిలో కంపచెట్లను తొలగించి క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని కోరారు.

ఎఐఎస్ఎ మండల కమిటీ ఎన్నిక

ఉరవకొండ : పట్టణంలో సోమవారం అలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎఐఎస్ఎ) మండల అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా ఎర్రిస్వామి, కార్యదర్శిగా చరణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు విద్యార్థి సంఘం నియోజకవర్గ కన్వీనర్ భీమేష్ తెలిపారు. తమ ఎన్నికకు సహకరించిన నియోజకవర్గ కన్వీనర్ భీమేష్, రాష్ట్ర అధ్యక్షులు వేమనకు కృతజ్ఞతలు తెలిపారు.

నాడు భారం.. నేడు బాదుడు..

పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలి-సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లుల దహనం

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్


కరెంటు బిల్లులను దహనం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భారం అన్నారు.. అదే అధికారంలోకి వచ్చాక బాదుడు మొదలు పెట్టారు అంటూ సిపిఎం నాయకులు మండిపడ్డారు. సర్దుబాటు పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్‌లో విద్యుత్ బిల్లులను తగులబెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ కూటమి నాయకులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా.. అధికారం రాగానే ఇంకోలా ప్రవర్తించడం సరికాదన్నారు. నాడు విద్యుత్ ఛార్జీలే పెంచమని చెప్పి.. అధికారం చేతిలోకి రాగానే ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం వేయడం ఏంటని నిలదీశారు. అదేవిధంగా స్మార్ట్ మీటర్లు బిగించి విద్యుత్ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. వెంటనే పాలకులు స్పందించి విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, లేనిపక్షంలో ఉరానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జగన్మోహన్‌రెడ్డి, నరసింహారెడ్డి, హనుమంతురెడ్డి, నాగరాజు, శ్రీరాములు, రామ్మోహన్, ప్రజాశక్తి ఆది, పూసల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

ఎస్కెయు వైస్-ఛాన్సలర్ బి.అనిత
అంతర్ డిగ్రీ కళాశాలల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం


మాట్లాడుతున్న ఎస్కెయు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.అనిత

క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకుని క్రీడల్లో రాణించాలని ఎస్కె యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ బి.అనిత పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని ఎస్‌వి డిగ్రీ, పిజి కళాశాలలో అంతర్ డిగ్రీ కళాశాల క్రికెట్ టోర్నమెంట్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్కెయు విసి అనిత మాట్లాడుతూ క్రికెట్‌లో గెలుపు.. ఓటమి కంటే క్రీడల్లో పాల్గొనడం చాలా ముఖ్యం అన్నారు. క్రీడల్లో రాణిస్తే మెరుగైన అవకాశాలు ఉంటాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ గెలుపోటములను సమానంగా తీసుకుని రాణించాలని పిలుపునిచ్చారు. కళాశాల చైర్మన్ సి.సోమశేఖరరెడ్డి మాట్లాడుతూ 21వ తేదీ వరకూ ఎస్‌వి డిగ్రీ, పిజి కళాశాల ఆధ్వర్యంలో ఎస్కెయు పరిధిలోని అంతర్ డిగ్రీ కళాశాల క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్కెయు క్రీడా విభాగం ప్రొఫెసర్ బి.జెస్సీ, ఎస్‌వి కళాశాల వైస్‌చైర్మన్ సి.చక్రధరరెడ్డి, ప్రిన్సిపాల్ ఎన్ఎవి ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసులు, ఎఒ ఎ.శ్రీనాథ్, ఆర్గనైజింగ్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసులునాయక్, వివిధ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అధికారం మాది.. చెప్పింది చేయాల్సిందే..

లేకుంటే వెళ్లిపో..
యల్లనూరు తహశీల్దార్‌పై టిడిపి నాయకుడి ఆగ్రహం

ప్రజాశక్తి-యల్లనూరు


తహశీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న టిడిపి నాయకులు

'అధికారం మాది.. మేం చెప్పినట్టు సంతకాలు చేయాలి.. లేకుంటే ఇక్కడి నుంచి వెళ్లిపో..' అంటూ ఓ టిడిపి నాయకుడు తహశీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన ఘటన సోమవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు వెంకట రమణారెడ్డి ప్రయివేటు ఇసుక రీచ్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అయితే మైన్స్, మండల సర్వేయర్ చేసిన బౌండరీల్లో తేడాలు రావడంతో కలెక్టర్ కార్యాలయం నుంచి దరఖాస్తు వెనక్కి వచ్చింది. దీంతో ఆగ్రహించిన టిడిపి నాయకుడు తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహశీల్దార్‌పై విరుచుకుపడ్డాడు. ఇసుక మేట్లను సందర్శించి కొలతలను సరిదిద్ది సంతకాలు పెడతానని తహశీల్దార్ చెబుతున్నా టిడిపి నాయకుడు వినిపించుకోలేదు. కార్యాలయ సిబ్బంది అందరూ చూస్తున్నట్టుగానే ప్రభుత్వం తమది.. తాము చెప్పిన చోట నీవు సంతకాలు చేయాల్సిందే.. లేకుంటే ఇక్కడి నుంచి వెళ్లిపో అంటే ఆగ్రహం వ్యక్తం చేస్తూ హుకుం జారీ చేశాడు. తాను వచ్చి కొలతలు చూసేంత వరకూ సంతకాలు పెట్టేది లేదని తహశీల్దార్ తెగేసి చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెనక్కి వెళ్లాడు. ఈ విషయంపై తహశీల్దార్ రాజాను వివరణ కోరగా తిరుమలాపురం గ్రామంలో ప్రయివేటు ఇసుక రీచ్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అయితే సర్వే కొలతల స్కెచ్‌లో కొంత తేడా రావడంతో వాటిని సరిదిద్దితే ఫైల్‌పై సంతకాలు చేస్తానని చెప్పా. అయినా వినకుండా ఎందుకు సంతకాలు పెట్టవని వెంకటరమణారెడ్డి బెదిరించాడని వాపోయాడు.

బాధ్యతగా పని చేయాలి

సాగునీటి సంఘం సభ్యులతో ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల


సాగునీటి సంఘం నాయకులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులతోపాటు డైరెక్టర్లు బాధ్యతగా పని చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొంది. శింగనమల రంగరాయల చెరువు అధ్యక్షులు, డైరెక్టర్లు సోమవారం అనంతపురంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయకట్టు అధ్యక్షులు, డైరెక్టర్లు బాధ్యతగా పని చేసి అభివద్ధి దిశగా ముందుకెళ్లాలని సూచించారు. ముఖ్యంగా రైతులకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకుడు లాయర్ పేట ఈశ్వర్ రెడ్డి, అట్టే రామాంజనేయులు, ఆయకట్టు అధ్యక్షుడు గార్లదిన్నె సత్యానారాయణ, శింగనమల చెరువు 6వ డైరెక్టర్ అట్టే చిన్న చౌడప్ప, నాయకులు మాసుల చంద్రమోహన్, పెద్ద నాగమణి, శంకర్ నారాయణ భాష ఇస్మాయిల్ టైలర్ వడ్డే అంజి పాల్గొన్నారు.

అలాగే కల్లుమడి ఆయకట్టు సంఘం సభ్యులు ఎమ్మెల్యేతోపాటు సీనియర్ నాయకురాలు బండారు లీలావతిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా టిడిపి అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆయకట్టు డైరెక్టర్లు కలిసి బొకే శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ దర్శి వేణుగోపాల్, దేగల శ్రీనివాసులు, కురుబ ఓబుళపతి, దర్శి శ్రీనివాసులు, బాల్‌రెడ్డి, గొల్ల భాస్కర్, వడ్డే రామాంజనేయులు, నాగేంద్ర, నాయకులు చిట్టి నాయుడు, శశిధర్‌నాయుడు, డి.మల్లికార్జున, కురుబ ఎర్రిస్వామి, ఓబులేసు, లక్ష్మయ్య, దేగల కిరణ్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు, ఎస్సీ, ఎస్టీ జెఎసి నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్


ధర్నా చేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులు, సిఐటియు, ఎస్సీ, ఎస్టీ జెఎసి నాయకులు

జిల్లాలోని గిరిజన గురుకలం పాఠశాలలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను కాంట్రాక్ట్ ఉపాధ్యాయులుగా పరిగణించ కనీస వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఎస్సీ, ఎస్టీ జెఎసి చైర్మన్ సాకే హరి డిమాండ్ చేశారు. సోమవారం గిరిజన గురుకులంలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారం కోరుతూ చేపడుతున్న నిరసనలు 31వ రోజుకు చేరుకున్నాయి. ఉపాధ్యాయులకు మద్దతుగా సిఐటియు, ఎస్సీ, ఎస్టీ జేఎసి నేతలు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ వి.వినోద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం పెన్నార్ భవన్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాశ్వత పనులకు శాశ్వత ప్రాతిపదికన విద్యా రంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు 5 నుంచి 18 సంవత్సరాలుగా గురుకులాల్లో పని చేస్తున్నారని తెలిపారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు కాని దుస్థితి నెలకొందన్నారు. పైగా డిఎస్సీలో గురుకులం పోస్టులు కూడా కలిపి నోటిఫికేషన్ జారీ చేయడం వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఎప్పటికైనా తమకు ఉద్యోగ భద్రత ఉంటుందని పని చేస్తు వచ్చిన ఉపాధ్యాయులను అన్యాయం చేసేలా ప్రభుత్వం చర్యలు ఉన్నాయని తెలిపారు. గిరిజన గురుకులం ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులందరిని కాంట్రాక్ట్ ఉపాధ్యాయులుగా మార్పు చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నా మానస పుత్రికలు గురుకులాలు అంటూ చెబుతుంటారని అలాంటిది అందులో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించే బాధ్యత కూడా ముఖ్యమంత్రికి ఉందని గుర్తు చేశారు. గిరిజన గురుకులం ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు సిహెచ్.లోకన్న మాట్లాడుతూ ఉపాధ్యాయులందరిని కాంట్రాక్ట్ విధానంలోకి మార్పు చేసి 22 పిఆర్‌సి అమలు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. జిల్లాలో 120 మంది, రాష్ట్రంలో 1559 మంది ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు పని చేస్తున్నారని వారందరికి న్యాయం చేయాలని కోరారు. అనంతరం డిటిడబ్ల్యుఒ రామాంజినేయులను కలిసి వినతి పత్రం అందజేశారు.

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు

ప్రజాశక్తి-యల్లనూరు


స్మార్ట్ మీటర్ బిగిస్తున్న విద్యుత్ అధికారి

మండల కేంద్రంలోని దుకాణాలకు విద్యుత్ అధికారులు సోమవారం స్మార్ట్ మీటర్లను బిగించారు. స్థానిక వడ్రంగి దుకాణాలకు స్మార్ట్ మీటర్లు అమర్చడంతో ప్రజల్లో అలజడి మొదలైంది. రానున్న రోజుల్లో ప్రతిఇంటికీ స్మార్ట్ మీటర్లు అమర్చడం వల్ల విద్యుత్ ఛార్జీలు అధికం అవుతాయని వినియోగదారులు చర్చించుకుంటున్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మహాసభలను జయప్రదం చేయండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-గుత్తి

ఎస్ఎఫ్ఐ 32వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం గుత్తిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణ శివారులోని మాసినేని ఉన్నత పాఠశాలలో 17, 18వ తేదీల్లో మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విద్య పరిరక్షణ, పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్ కోసం కార్యాచరణను మహాసభల్లో నాయకులు రూపొందిస్తారన్నారు. సభలకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న, జిల్లా నాయకులు హాజరవుతారని చెప్పారు. విద్యార్థులు సభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదుకు విరాళం


సభ్యత్వ నమోదుకు విరాళం అందజేస్తున్న టిడిపి నాయకులు

అనంతపురం రూరల్ : సభ్యత్వాల నమోదు కోసం 49వ డివిజన్ నాయకులు రామసుబ్బయ్య, సంజీవరాయుడు సోమవారం రూ.50వేల విరాళం అందజేశారు. ఈమేరకు అర్బన్ టిడిపి కార్యాలయంలో టిడిపి రాష్ట్ర నాయకుడు గంగారామ్‌కు డివిజన్ నాయకులతో కలిసి సంబంధిత మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామసుబ్బయ్య, సంజీవరాయుడును ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభినందించారు.

ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


ప్రజాశక్తి-ఉరవకొండ

వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎపి మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు భత్తుల కోదండరామిరెడ్డి కోరారు. ఈమేరకు అనంతపురంలోని స్వగృహంలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణశ్రీని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తూ మరణించిన కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాలను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వీటితోపాటు అనేక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ ఆయా సమస్యలను సిఎంతోపాటు మంత్రి నారా లోకేష్, దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

డ్రోన్ కెమెరాలతో అసాంఘిక కార్యకలాపాలు గుర్తింపు

తాడిపత్రి రూరల్ : జిల్లావ్యాప్తంగా పోలీసులు డ్రోన్ కెమెరాల సాయంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం రూరల్ పరిధిలోని ఆటోనగర్ సమీపంలో పోలీసులు డ్రోన్ కెమెరాలు వినియోగించి ఓపెన్ డ్రింకింగ్ చేస్తున్న వారిని అదుపులోకి తీసుకోవడంతోపాటు కేసు నమోదు చేశారు. డ్రోన్ కెమెరాలతో తాడిపత్రి రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నవారిని అదుపులోకి తీసుకుంటున్నట్లు తెలిపారు.

కలెక్టర్‌తో ఆర్టీసీ చైర్మన్ భేటీ


కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న ఆర్టీసీ చైర్మన్ పూల నాగరాజు

అనంతపురం రూరల్ : కలెక్టర్ వినోద్‌కుమార్‌ను ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూలనాగరాజు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం జిల్లాలోని ఆర్టీసీలో ఉన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

26 నుంచి ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

ఈనెల 26 నుంచి సెల్‌ఫోన్ రిపేరీలో యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన 18-45 వయసు ఉన్న యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఆధార్, రేషన్ కార్డులతో ఆకుతోటపల్లి వద్ద ఉన్న తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

ఆటో బోల్తా డ్రైవర్ మృతి

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని జోడి ధర్మాపురం గ్రామ సమీపంలో దగ్గర ఆటో బోల్తా పడి వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుత్తి మండలానికి చెందిన రామాంజనేయులు, నరసింహులు కొత్తపేట నుంచి ఆటోల వస్తుండగా టోల్‌ప్లాజా వద్దకు రాగానే ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ రామాంజనేయులు, నరసింహులు తీవ్రంగా గాయపడ్డారు. వీరితో రామాంజనేయులు పరిస్థితి విషమించి మార్గమధ్యంలో మృతిచెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మామిడి తోటకు నిప్పు


కాలిన తోటను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

బుక్కరాయసముద్రం : మండలంలోని కొర్రపాడు గ్రామంలో వెంకటకొండకు చెందిన మామిడి తోట సోమవారం మధ్యాహ్నం అగ్నికి ఆహుతైంది. దీంతో 14 ఎకరాల్లో సాగు చేసిన రెండేళ్ల మామిడి చెట్లతోపాటు డ్రిప్పు వైర్లు పూర్తిగా కాలిపోయినట్లు తెలిపారు. రూ.లక్ష వరకూ నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయాడు. విషయం తెలుసుకున్న పండ్ల తోటల రైతుసంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.కుళాయప్ప, రైతుసంఘం మండల సెక్రటరీ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, సంజీవరెడ్డి, పుల్లయ్య, నెట్టికల్లు, తదితరులు తోటకు వెళ్లి పరిశీలించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి బాధిత రైతును ఆదుకోవాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు.

మృతుడు తాడిపత్రి వాసిగా గుర్తింపు

తాడిపత్రి రూరల్ : మండలంలోని తలారి చెరువు వద్ద ఆదివారం ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. అయితే మృతుడు తాడిపత్రి పట్టణంలోని టైలర్స్ కాలనీకి చెందిన వెంకటరమణగా రూరల్ పోలీసులు గుర్తించారు. ఈ సందర్భంగా సిఐ శివగంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ వెంకటరమణ బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అయితే మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సిఐ వెల్లడించారు.

కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి-పామిడి

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని గిరిజన గురుకులాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌నాయక్ కోరారు. ఈమేరకు సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గురుకులాల్లో ఉన్న కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, జీతాలు పెంచాలని ఎన్నో ఏళ్ల నుంచి కోరుతున్నా పట్టించుకోలేదన్నారు. కావున మీరైనా స్పందించి కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

రైతులకు ఈ-పాస్ బుక్కులు ఇవ్వాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండల రైతులకు రెవెన్యూ అధికారులు ఈ-పాస్ పుస్తకాలు అందివ్వాలని సిపిఐ మండల కార్యదర్శి నీళ్లపాల రామకృష్ణ, మండల సహాయ కార్యదర్శి బండారు శివ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ లక్ష్మీనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు హనుమన్న, గోవిందు, గోపాల్ నాయక్, రమణ నాయక్, నరసింహులు గోవిందు నాయక్, తదితరులు పాల్గొన్నారు

రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం

ప్రజాశక్తి-పామిడి


జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన దివాకర్‌రావును సోమవారం జిల్లాకేంద్రంలోని రెవెన్యూ కళామందిరంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎపి మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు భక్తుల కోదండరామిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు భారతి, సహాయ కార్యదర్శి సాంబశివుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సంబరంగా రథోత్సవం

గుమ్మఘట్ట : మండల పరిధిలోని తాళ్లకర గ్రామంలో వీరభద్రేశ్వర స్వామి రథోత్సవం జన సందోహం మధ్య సాగింది. ఇందులో భాగంగా విప్ కాలవ శ్రీనివాసులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గిరి మల్లప్ప, సర్పంచులు నాగరాజు, హనుమంతురెడ్డి, టిడిపి నాయకులు కుమార్‌రెడ్డి, రంగారెడ్డి, తాళ్లకెర వెంకటేశులు, వీరాపురం నాగరాజు, ఎస్సీ సెల్ అధ్యక్షులు చిన్ని కిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

భోగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

పామిడి : పట్టణం లోని ప్రాచీన భోగేశ్వర స్వామి ఆలయం సోమవారం భక్తులతో పోటెత్తింది. సూర్యుడు ధనుర్ రాశి లో ప్రవేశిస్తున్న సందర్భంగా ఫాల్గుణ మాసంలో సోమవారం, ఆరుద్ర నక్షత్రం కలసి రావడం తో తెల్లవారు ఝూమున భక్తులు బారులు తీరారని ఆలయ ప్రధాన అర్చకులు రాము స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం అభిషేకం చేస్తే సర్వ శుభాలు కలుగుతాయని ఉపన్యాస వక్త చాగంటి కోటేశ్వరరావు వారి ఉపన్యాసాలు భక్తులను మేల్కొల్పాయన్నారు.వేద పండితులు ప్రత్యేక,విశేష పూజలు అభిషేకాలు చేశారు. ప్రత్యేక సుఘంద పుష్పలతో అలంకరణ చేసి నివేదన, నవవిధ హరతులు గావించి, తీర్థ ప్రసాదాలు అందించారు. ప్రాత్ణకాల, అభిషే అలంకారాలు, దినసరి అభిషేక, అలంకారాలు వేరు వేరు గా జరిపారు. భజన బందం భజనలు ఆలపించారన్నారు.



పూజలందుకున్న భోగేశ్వరస్వామి

కలిసికట్టుగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందాం

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

అందరం కలిసికట్టుగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని ఇఒఆర్‌డి నాగభూషణం పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామాల సమకృత అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామాల్లో సురక్షిత తాగునీరు, పారిశుధ్యం, వీధిదీపాలు, తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా 15వ సంఘం ఆర్థిక నిధులు ఏవిధంగా ఖర్చు పెట్టాలో వివిధ శాఖల అధికారులకు ఇఒఆర్‌డిఒ వివరించారు. గ్రామాల్లో సిసి రోడ్లతోపాటు మురికి కాలువలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధి, సురక్షిత, మహిళా సాధికారిక, విద్య, వైద్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీకాంత్‌చౌదరి, ఎంఇఒ మస్తాన్‌రావు, మండల ఇంజినీర్ ఓబులేసు, ఎబిఎన్ గుణభుషణ్, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ అలివేలమ్మ ఆధ్వర్యంలో సుస్థిర మండల అభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజులపాటు నిర్వహించనున్న శిక్షణను సోమవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా మండలంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, భవిష్యత్తులో అవసరమయ్యే అవసరాలు, గ్రామీణ ప్రాంత ప్రజల ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి జిలాన్‌బాషా, ఎంఇఒ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా మండలంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, భవిష్యత్తులో అవసరమయ్యే అవసరాలు, గ్రామీణ ప్రాంత ప్రజల ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు.

పామిడి : మండలంలోని గ్రామాల అభివృద్ధిపై సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా ప్రజల మౌలిక వసతులు, తాగునీరు, పారిశుధ్యం, పేదరిక నిర్మూలన, ఆరోగ్యం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్, తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ తేజోష్ణ, ఇఒఆర్‌డి కృష్ణకుమార్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం సర్పంచులు, సచివాలయ ఉద్యోగులు, మండల అధికారులకు ఎంపిడిఒ దాస్‌నాయక్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. అందులో గ్రామా భివృద్ధి, పరిసరాల పరిశుభ్రత, విద్య, ఆరోగ్యం, తదితర అంశాలపై పలు సూచనలు, సలహాలు చేశా రు. ఎంపిడిఒ మాట్లాడుతూ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో కలిసి గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు.

శిక్షణలో అధికారులు



గుంతకల్లు మండలంలో హాజరైన సచివాలయ సిబ్బంది



ఉరవకొండలో మాట్లాడుతున్న ఇఒఆర్‌డి దామోదర్‌రెడ్డి



నార్పల శిక్షణలో మాట్లాడుతున్న అధికారులు

కార్యక్రమంలో ఈపిఒఆర్‌డి దేవదాస్, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ శీనానాయక్, పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ఐసిడిఎస్ సిబ్బంది, సర్పంచులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ గంగావతి ఆధ్వర్యంలో సుస్థిర మండల అభివృద్ధి లక్ష్యాలపై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా మండలంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, భవిష్యత్తులో అవసరమయ్యే అవసరాలు, గ్రామీణ ప్రాంత ప్రజల ఉపాధి అవకాశాలు, సామాజిక దురాచారాలు, తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి శైలజారాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ జనార్ధన్, సిహెచ్‌ఒ బాలాజీరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సృణాలిని, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : మండలంలోని వివిధ గ్రామాల అభివృద్ధిలో భాగంగా సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి, విఆర్‌ఒలు, సర్వేయర్లు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎఎన్‌ఎంలు, ఎహెచ్‌ఎలు పాల్గొన్నారు.

ఉరవకొండ : వజ్రకరూరు మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో ఇఒఆర్‌డి దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సుస్థిర అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఇఒ గురుప్రసాద్, అడ్మినిస్ట్రేషన్ అధికారి శ్రీనివాసులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఉరవకొండ విద్యార్థి

ప్రజాశక్తి-ఉరవకొండ




విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఉరవకొండలోని ప్రభుత్వ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ఈడిగ శశాంత్‌గౌడ్ జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు హనీఫ్, పిడి మారుతి, కిరణ్ తెలిపారు. ఈమేరకు సోమవారం ఉరవకొండలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శశాంత్‌గౌడ్ గతనెల 6వ తేదీ నుంచి విశాఖపట్నం జిల్లాలో జరిగిన అండర్-17 ఖోఖో పోటీల్లో రాష్ట్రస్థాయి జట్టుకు జిల్లా తరపున ప్రాతినిథ్యం వహించి అత్యంత ప్రతిభ కనబరిచారన్నారు. దీంతో ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకూ ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున ఆడునున్నట్లు తెలిపారు. శశాంత్ గౌడ్ జాతీయ స్థాయి జట్టుకు ఎంపిక కావడం పట్ల పాఠశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు అభినందనలు తెలిపారు..

జిల్లాకు 896 మెట్రిక్ టన్నుల ఎరువులు రాక

అనంతపురం : జిల్లాకు 896 మెట్రిక్ టన్నుల ఇఫ్కో కంపెనీ ఎరువులు సోమవారం స్థానిక ప్రసన్నాయపల్లికి వచ్చినట్లు అనంతపురం ఎడిఎ ఎం.రవి తెలిపారు. ఇందులో 514 మెట్రిక్ టన్నుల డిఎపి ఎరువులు, 20:20:0:13.382 మెట్రిక్ టన్నులు వచ్చాయన్నారు. వాటిని పరిశీలించి కంపెనీ గోదాములకు తరలించామన్నారు.



ఎరువులను తనిఖీ చేస్తున్న ఎడిఎ రవి



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న అధికారి నాగేంద్రప్రసాద్

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-రాయదుర్గం

ఉష్ణోగ్రతలు తగ్గి, చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో చిన్నారులు, వృద్ధుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా రాయదుర్గం సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు. పట్టణంలోని చౌడమ్మ గుడి ప్రాంతంలో సోమవారం 'స్వచ్ఛ రాయదుర్గం, స్వస్థ్య రాయదుర్గం' లో భాగంగా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఐదేళ్ల కంటే తక్కువ వయసు గల పిల్లల మరణానికి నియోనియా ఓ కారణం అన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వాటి నుంచి రక్షణ పొందవచ్చు అన్నారు. నియోనియా లక్షణాలు, నివారణ మందులు, జాగ్రత్తలను వివరించారు. లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందాలన్నారు. అలాగే వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు శాంతకుమారి, ఆరోగ్య కార్యదర్శులు నలిని, శోభ, సరోజ, ఈశ్వరమ్మ, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'అమరజీవి'కి నివాళి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

పట్టణంలోని కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సభ నిర్వహించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శ్రీనివాసులు అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ తెలుగు మాట్లాడే వారి కోసం ప్రత్యేకంగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోస పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేసిన మహానీయుడు అని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఫరిసా ఫిర్దోస్, దేవదాస్, అమీర్‌హుస్సేన్, ఉమర్ షరీఫ్, సిద్ధప్ప, మల్లికార్జున, నాగమణి, లీలావతి, తదితరులు పాల్గొన్నారు.